అమర గాయకుడు

గత మూడు దశాబ్దాలుగా అశేషాంధ్ర ప్రజల హృదయాలలో అద్వితీయమైన స్థానాన్ని పొందిన గాయక శ్రేష్ఠుడు శ్రీ ఘంటసాల.

శ్రీ ఘంటసాల ప్రజల గాయకుడు. ఎన్నోవిధములైన అభిరుచులు గల ప్రజలందరికీ అన్ని రకాలైన పాటలు పాడి మెప్పించిన ధన్యుడు

ఆయన పాడిన పాటలు పదివేలకు పైగానే రికార్డు చేయబడ్డాయి అయినా, ఆయన ముఖతః వినవలసిన పాటలు ఇంకా ఎన్నో మిగిలిపోయాయనే అనిపిస్తుంది తెలుగు ప్రజానీకానికి

శ్రీ ఘంటసాల పాడినది లలిత సంగీతమా, సుగమ సంగీతమా, శాస్త్రీయ సంగీతమా అనే చర్చ అంత అవసరమయినది కాదు ఆయన సంగీతం ఈ పరిమితులను అధిగమించింది. రీతి ఏదైనా, ప్రజా హృదయాన్ని కదిలించగల సంగీతమే ఆయన లక్ష్యం

నేపథ్య గాయకుడుగా ఆయన పాడిన అనేక వేల పాటలు సినిమా ప్రయోజనాన్ని సాధించడంతోనే పూర్తి కాలేదు అవి తెలుగు ప్రజా జీవితంలో ఒక భాగంగా పరిణమించాయి. అంతేకాదు. ఆయన అనుసరించిన సంగీత మార్గం సంప్రదాయ సంగీతంలో ఒక నూతన శాఖగా నిలిచి అభివృద్ధి చెందుతూండడం కూడా గమనించగలం ఆయన గాయకుడుగా అమరుడు

స్వర లయలలో శ్రీ ఘంటసాలకు గల అధికారం సంపూర్ణమైనది కానిపక్షంలో స్వరకర్తగా, శ్రేష్ఠతమ గాయకుడుగా ఇంతకాలం ధ్రువతారగా నిలిచి ఉండడం జరిగేది కాదు

శ్రీ ఘంటసాల సంగీత రచనలో అనుసరించిన సూత్రం ఒక్కటే. ఆదే గీత నిర్మాణంలో గల సౌలభ్యమూ, సౌందర్యమూను అందుచేతనే ఆయన పాటలు అంత జనాదరణ పొందడమే కాదు, అధిక ప్రచారాన్ని కూడా పొందడం జరిగింది.

శ్రీ ఘంటసాల సంగీతం కేవలం రాగ తాళాత్మకమైన నాదానుభవం కాదు.

ఆయన గానం చేసినదీ, ప్రచారం చేసినదీ 'పాట'. ఆ పాటలో నిర్దిష్టమైన రసం, భావం గల సాహిత్యానికి సమర్థవంతంగా, సార్థకంగా రాగం, తాళం సమన్వయ పరచడమే ఆయన గీత నిర్మాణంలో గల విశిష్టత సంగీత సాహిత్యాలను సమ్మేళనం చేయడంలో శ్రీ ఘంటసాలకు గల శ్రద్ధ అపారం ఈ విషయంలో ఆయనకు గల ప్రతిభ అనన్యం

రాగ భావానికి ఎక్కువ అవకాశం గల చోట కూడా, సాహిత్య పోషణకు దోహదం కాని పక్షంలో రాగ సంచారంలో గల వది భంగతులలో ఏ ఒక్కటో ఎన్నుకొనే వారు. ఆ ఒక్క సంగతే ఎంతో సార్థకంగా ఉండేది.

రస నిష్పత్తికి అనుగుణమైన రాగ తాళములను నిర్ణయించుకోవడంలో ఆయన ప్రతిభ ఎంతో నైసర్గికమయినది.

ఎన్నో సంప్రదాయ రాగాలను ఆయన అతి లలితంగానూ, సమర్థవంతంగానూ ప్రయోగించారు పాటలలో. శ్రీ ఘంటసాల ఉపయోగించిన రాగాలలో ఉత్తరాది సంగీత ప్రభావం కన్నా, కర్నాటక రాగ సంచారమే లలితమైన గమకంతో నడుస్తుంది చారుకేశి, చక్రవాకం మొదలైన సంప్రదాయ రాగాలను కూడా, సినిమా పాటలలో కూడా ఆయనే సాహసంతో ప్రప్రథమంగా ప్రయోగించారు

శ్రీ ఘంటసాల సంగీతం ఎడల ఆంధ్ర ప్రజలలో ఇంత మమకారం ఏర్పడడానికి మరొక కారణం కూడా ఊహించవచ్చును. శాస్త్రీయ సంగీతంలో దాక్షిణాత్య ప్రభావమూ, నాటక సంగీతంలో మహారాష్ట్ర, హిందూస్తానీ సంగీత ప్రభావమూ ప్రబలంగా ఉన్న ఆ రోజుల్లో—తెలుగు పాట తెలుగు పాటగా వినిపించని పరిస్థితిలో నూతనోత్తేజంతో తెలుగు పాట సర్వాంగ సుందరంగా ఘంటసాల కంఠంనుంచి వెలువడింది తెలుగు పాట తన ప్రత్యేకమైన శైలిని నిరూపించుకుంది. తెలుగువాడు తన పాట తన ప్రత్యేకమైన బాణీలో పాడుకొనగలిగే ఆత్మ విశ్వాసం ఏర్పడింది.

శ్రీ ఘంటసాల కష్టించి సాధన చేసినది శాస్త్రీయ సంగీతమే అయినా, తెలుగునాట ప్రచారం పొందిన భజన సంకీర్తనలు, హరికథలు, బుర్రకథలు, జముకుల పదాలు మొదలైన వాటిలో ప్రయోగించబడిన దేశి సంగీతంలో ఆయనకు ఎంతో ప్రేమ, గౌరవం ఉండేవి ఎంతో చిత్తశుద్ధితో ఆయన ఆ భావాల నన్నింటినీ స్వంతం చేసుకున్నారు అందుచేతనే ఆయన సంగీతంలో అంత తెలుగుతనం ఉట్టిపడేది.

శ్రీ ఘంటసాల ప్రత్యేక బాణీని నిరూపించినది ఆయన పద్య పఠన పద్ధతి అంతవరకూ స్టేజి నాటకాలలో చదివే పద్య పఠనానికి భిన్నమైన శైలి ప్రవేశపెట్టారు ఘంటసాల. ఘంటసాల పద్య పఠనం ఒక విశిష్టమైన సంగీత ప్రక్రియ. రాగభావం పద్యం అంతటా సంపూర్ణంగా విస్తరించి ఉంటుంది, సాహిత్యాన్ని పోషిస్తూ ఘంటసాల పద్య పఠనం రసిక ప్రపంచంలో చాలా ఆదరణ పొందింది. పాతిక సంవత్సరాల క్రితం రికార్డు చేసిన 'పుష్ప విలాపం', 'కుంతీ కుమారి' పద్యాలు ఎన్నటికీ నిత్య నూతనంగానే నిలిచాయి.

ఆయన సంగీతంలో 'దేశి' సంగీత ప్రభావం చాలా ఉండేది ఎన్నో జానపద గీతాలలోని సంగీతాన్ని నూతన అభిరుచులకు అనుగుణంగా మలిచారు.

శ్రీ గురజాడ అప్పారావు గారి 'పూర్ణమ్మ కథ' శ్రీ ఘంటసాల బుర్రకథ శైలిలో గానం చేశారు. ఆ బుర్రకథ ఆయన ఉత్తమ స్వర రచనలలో ఒకటిగా భావించవచ్చును. తిరిగి అంత ఉత్తమమైన బుర్రకథ మళ్ళీ వినిపించలేదంటే అతిశయోక్తి కాదు.

'రహస్యం' చిత్రంలో శ్రీ ఘంటసాల స్వర రచన చేసిన యక్షగానం చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్ళె గారి వంటి విద్వాంసుల ప్రశంసలను పొందింది.

ఒక్కొక్క భావావేశంలో ఆయన స్వయంగా పాటలు రాసుకొనే ధోరణి కూడా ఉండేది. "బహు దూరపు బాటసారి" అనే రచన ఆయన స్వంతమే. అత్యధికమైన ప్రచారం పొందిన ఆయన పాటలలో అది ఒకటి.

ఏ ప్రజల ఉద్యమం తల ఎత్తినా, దానికి దోహదంగా శ్రీ ఘంటసాల కంఠం పలికేది. స్వాతంత్ర్య సమరం రోజులలో ఆయన దేశభక్తి గీతాలతో దేశం ప్రతిధ్వనించింది ఆయన భక్తి గీతాలు ప్రతి దివ్యక్షేత్రంలో ఏనాటికీ వినిపిస్తూ యాత్రికులకు దివ్యమైన అనుభూతిని కలిగిస్తాయి.

శ్రీ ఘంటసాల కంఠస్వరం ప్రకృతిలో అపురూపంగా వ్యక్తమయే విశేషాలలో ఒకటి. ఆయన ఉచ్చారణలో గాని, భావానుగుణమైన కంఠస్వరం పట్టువిడుపులలోగాని ఏ విధమైన కృతకత్వం ఉండేది కాదు.

ఆధునికమయిన తెలుగు సంగీతం చరిత్ర ఆయనతోనే ప్రారంభం అయిన దనడం సమంజసం. తెలుగులో నేపథ్య సంగీత విధానానికి కూడా ఆద్యుడు ఆయనే!

దేశంలో నేడు అధిక ప్రచారంలోకి వచ్చిన లలిత సంగీత కచేరీలకు కూడా నాంది ఆయనదే! కొన్ని వేల సంగీత కచేరులు చేశారు ఆయన. ఆయన లలిత సంగీతం కచేరీలు ఎంతో హుందాగా నడిచేవి

కచేరీలలో ఏ రకం పాట పాడినా అదొక ప్రత్యేక కళారూపంగా ఉండేది.

ఆయన జీవితంలో అతి గాఢమైన అనుభవాలు పొందిన వ్యక్తి ఆ గాఢమైన అనుభవాలు ఆయన కళ హృదయానికి ఎంతో గాంభీర్యాన్ని, హుందాతనాన్ని కలిగించాయి అప్పుడప్పుడు ఆయన పొందిన అనుభవాలను సన్నిహితులకు వినిపించడం ఆయన కొక సరదాగా ఉండేది ఈ విధమైన ఆత్మకథా కాలక్షేపం సన్నిహితులైన మిత్రులకు తన్మయత్వం కలిగించేది.

ఆయన అపారంగా కీర్తి, ధనం పొందిన రోజుల్లో కూడా నిస్సహాయంగా, పానగల్ పార్కు అరుగుల మీద పడుకొంటూ ఆ నాటి మిత్రులతో గడిపిన రోజులను, మధురమైన అనుభవాలు ఎప్పుడూ జ్ఞాపకం చేసుకొనే వారు.

శ్రీ ఘంటసాల జీవితంలో నెరవేరని ఆశ ఒకటే...

శాస్త్రీయ సంగీతంతోపాటు దేశి సంగీత రీతులను కూడా శిక్షణ ఇచ్చే సంగీత కళాశాల తన పేర నిర్మించాలని ఉండేది ఆయనకు. తన పేర సంస్థ వెలువడడం కన్నకూడా తన ఆశయం నెరవేరడమే ఆయన ధ్యేయం. సమీప భవిష్యత్తులోనే ఆయన సంకల్పం నెరవేర గలదని ఆశిద్దాం *

ఘంటసాల

-పి. సంగీతరావు

స్త్రీలకోసం

ఉద్యోగిని

-మాలతీ చందూర్

ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లలకు ఉండే సమస్యలు విచిత్రంగా ఉంటాయి. వీటికి కారణాలు వెతికి చూసినపుడు ఆ సమస్యలకు స్త్రీలూ, పురుషులూ ఇద్దరూ బాధ్యులే ననిపిస్తుంది.

మొన్న సరస్వతి మా ఇంటికి వచ్చినప్పుడు నిస్పృహతోనూ, బాధతోనూ తన గొడవ చెప్పడం మొదలు పెట్టింది. సరస్వతి బి. ఎ. పాసయింది. ఎమ్. ఎ. చదవడానికి అవకాశం లేనందువల్ల టైపు హయ్యరూ, షార్ట్ హేండు లోయరూ పాసయింది ఆమెకు తండ్రి లేడు తల్లి, మామ్మా, చెల్లెలూ, తమ్ముడూ — ఈ నలుగురూ ఆ అమ్మాయి సంపాదన మీద ఆధారపడి ఉన్నారు సరస్వతికి పెళ్ళి చేసుకోవాలని లేదు పెద్ద అందగత్తె కాదు. సామాన్యంగా ఉంటుంది ఉద్యోగాలకు అప్లికేషన్సు పెట్టగా పెట్టగా, మద్రాసులోని ఒక ప్రయివేటు కంపెనీలో టైపిస్టు ఉద్యోగం దొరికింది నెలకు రెండు వందల అరవై అయిదు రూపాయలు— జీతం, అలవెన్సులూ అన్నీ కలిపి మొత్తం అది. ఆ పాటి జీతంతో ఉద్యోగం లభించేసరికి సరస్వతికి ఎవరెస్ట్ ఎక్కినంత ఆనందం కలిగింది. తమ సమస్యలు, కుటుంబ బాధలు తీరిపోయా యనుకుంది కాని, అసలు సమస్యలు అప్పుడే ప్రారంభమయ్యాయి. తనకి మనసేం బాగుండడం లేదు. ఏం చెయ్యడానికీ పాలుపోవడంలేదు. దీనికి పరిష్కారం దొరకడం లేదు, అనే సరికి—

"ప్రేమలో పడ్డావా?" అని అడిగాను.

"ఛఛ. అదేం లేదండీ. నేను ఎక్కడ ఉండాలీ అన్న సమస్య ..."

"ఏం? మీ మేనత్త ఉన్నారుగా! మొదట్లో అక్కడే ఉన్నా ననుకుంటాను."

"ఇంటర్వ్యూకి వచ్చినప్పుడు, జాయిన్ అయ్యాక అక్కడే ఉన్నాను. మొదట్లో అత్తా వాళ్ళూ బాగానే ఉన్నారు. నెలకి ఇంతా అని ఇస్తే వాళ్ళు తీసుకొరేదు. నాకే మొహమాటంగా ఉండి కూరా నారా, టీ, కాఫీపొట్లం... ఇలాగ ఇంటికి కావలసినవి తెస్తూ నెలకి అరవై డెబ్బై దాకా ఖర్చు పెట్టేదాన్ని. మా అత్త పిల్లలకి రాత్రిళ్ళు పాఠాలు చెప్పి, హోమ్ వర్కు అవీ చేయించే దాన్ని."

"అవును మరి. మరొకళ్ళకి బరువుగా ఉండకూడదు నీకు ఊరికే పెడుతున్నామని వాళ్ళు అనుకో కూడదు"

"మా అత్త మొగుడు మొదట్లో ముభావనిగా ఉండేవాడు. కాని, క్రమంగా నాతో కబుర్లు వేసుకోవడం మొదలు పెట్టాడు. ఒక్క పది నిమిషాలు లేటుగా వస్తే అజలూ ఆరాలూ తీస్తూండేవాడు."

"మంచిదేగా, ఆడపిల్లవని జాగ్రత్త తీసుకోవడం?"

"ఏం మంచి, నా తలకాయ మంచి! నా పట్ల అటువంటి శ్రద్ధ ఉంటే నేను మటుకు సంతోషించనా? ఆ చూపులూ, మాటలూ వెకిలిగా ఉండేవి, పిల్లలకి పాఠం చెపుతుంటే తను అక్కడ తిష్ఠ వెయ్యడం, పని ఉన్నా లేకపోయినా నా చుట్టూ తిరిగి మాటలు కల్పించుకోడం చిరాగ్గా ఉండేది. అయినా, సరిపెట్టుకున్నాను. కాని మా అత్తకు ఏదో అనుమానం, భయం. మొగుణ్ణి ఏమీ అనలేక నన్ను సాధించడం మొదలు పెట్టింది."

"ఓహో అందుకా నువ్వు హాస్టల్లో జేరింది?"

"మరేం చెయ్యను. ఇది పైకి అనుకో కూడనిది. అనుకుంటే మనకే సిగ్గు. అందుకని నెమ్మదిగా వర్కింగ్ వుమెన్స్ హాస్టల్లో చేరాను అక్కడ నెలకి నూట పాతిక కడుతున్నాను వేడినీళ్ళు అడిగితే ఎక్స్ట్రా, ఫేన్ ఉన్న రూమ్ అయితే ఛార్జి ఎక్కువ సాయంత్రం కాఫీకి మళ్ళీ ఛార్జి. అన్నీ కొలిచి కొలిచి పెడతారు. నీళ్ళు కరువని, బట్టలు ఉతుక్కుంటే — బక్కెట కింతా అని నీళ్ళకి ఛార్జి. ఇల్లా ఎన్ని ఎక్స్ట్రా ఛార్జిలో! జలగల్లాగా పీలుస్తున్నారు. బస్ పాసూ, హాస్టలుకి అంతా కలిపి నెలకి నూట ఎనభై అవుతోంది. ఇక నా దగ్గిర మిగిలేది ఎనభై అయిదు. ఈ ఎనభై అయిదు రూపాయల్లోను మా వాళ్ళు నలుగురు బ్రతకాలి"

"నువ్వు ఖర్చు తగ్గించుకునేందుకు వీలు లేదా?"

"ఏం తగ్గించుకోమన్నారు చెప్పండి? ఆఫీసులో — పి. ఎఫ్ వాటికి మినహాయించి, రెండు వందల ఏభై రెండు రూపాయలు నెల తిరిగేటప్పటికి నా చేతికి వస్తుంది. కాని, మా వాళ్ళకి కనీసం నూరు రూపాయలు కూడా పంపలేకుండా ఉన్నాను నేను సినిమాలకి వెళ్ళను పువ్వులు కొనుక్కోను హోటళ్ళకి వెళ్ళను. టాయిలెట్ సామాన్లకి ఖర్చు పెట్టను ఈ ఊరు వచ్చాక కొత్త చీరె కొనుక్కోలేదు అయినా, నెలకి నూట ఎనభై అవుతున్నాయి."

"పోనీ మీ వాళ్ళని తెచ్చి కాపరం పెడితే?"

"అదీ అనుకున్నాను. నెలకి డెబ్బయి రూపాయలు అద్దె అడుగుతున్నారు, రెండు గదులకి చెల్లెలూ, తమ్ముడూ స్కూళ్ళూ, వాళ్ళ బస్ ఛార్జీలు ఇవన్నీ పోను ఏం పెట్టుకు తినం? అక్కడ మా ఊళ్ళో స్వంత ఇల్లు కాబట్టి అద్దె బాధ లేదు పోనీ ఆ ఇల్లు అద్దె కిద్దామంటే ఇల్లు పాత తుక్కు నేడో రేపో కూలిపోయేటట్లుంది. అద్దె కెవరూ రారు."

"మొదట్లో ఉన్నట్లే మీ మేనత్త ఇంట్లో ఉంటే?"

"కాస్త డబ్బు మిగులుతుంది కాని, ఆవిడ భర్త నక్కలా చూస్తూంటాడు అత్తకి ఆయన మీద గల అనుమానం నా మీద క్రోధంగా మారుతుంది ఏం చెయ్య మన్నారు? పోనీ ఓ రూము తీసుకొని వండుకు తిందామంటే, పెళ్ళిగాని దానివని ఎవరూ రూము ఇవ్వరు. నలుగురు ఆడపిల్లలం కలిసి ఉందామంటే మాకు రక్షణ ఉండదు. పోనీ వర్కింగ్ వుమెన్స్ హాస్టలనుకుంటే మా తలకిమించి ఛార్జి చేస్తున్నారు నెలసరి ఖర్చు గాక చేరే ముందు డిపాజిట్టు. నే నెందుకు ఉద్యోగం చేస్తున్నాను? మా వాళ్ళకి నెలకి నూరు రూపాయలు కూడా పంపలేని ఉద్యోగం దేనికోసం? ఇంతకంటే చవకలో హాస్టల్సు నడపడానికి వీలవదా? అరవై డెబ్బై రూపాయల్లో మాలాంటి చిన్న ఉద్యోగినులకు హాస్టల్సు ఎందుకు లభించడం లేదు? మగవాళ్ళయితే నలుగురు కలిసి ఒక రూములో ఉండి చవగ్గా గడిపెయ్య వచ్చు, అలాంటి అవకాశం మా లాంటి ఉద్యోగినులకు రాదా? ఉద్యోగం చేసుకుంటున్న ఆడపిల్లమీద మొగవాడికి గౌరవం, తోటి స్త్రీకి సానుభూతి ఎందుకు ఉండటం లేదు? ఎన్నేళ్ళయినా మన సమాజం, మన దృక్పథం మారవా?"

సరస్వతి ఒక్కతే కాదు, వేల సంఖ్యలో ఉన్నారు అలాంటి వనితలు— పట్నాల్లో, బస్తీల్లో సరస్వతి ప్రశ్నలకి మీరు సమాధానం చెప్పండి. *

సామాన్యులకోసం వైద్యం

గజ్జి

డా॥ పి. వి. సుబ్బారావు

మన దేశ జనాభాలో ముమ్మరంగా వ్యాపించిన వ్యాధి గజ్జి. చర్మ వ్యాధులలో నూటికి 60 పాళ్ళు గజ్జితో బాధ పడుతున్నారు. అంటే చర్మ వ్యాధులలో ప్రథమ స్థానము గజ్జి ఆక్రమించుకున్నది.

ఇది సార్కోప్టెస్ స్కేబీ అన్న రోగ క్రిమి వల్ల వ్యాపిస్తుంది. దీనినే గజ్జి క్రిమి అనికూడా అంటారు.

ఈ వ్యాధి ఎటువంటి మహనీయుని నయినా పట్టి పీడిస్తుంది. ఈ గజ్జి తీట యాతన వల్లనే నెపోలియన్ చక్రవర్తి యుద్ధంలో ఓడిపోయాడట! కొంతమంది దరఖాస్తుదారులు పై అధికారిని సందర్శించినప్పుడు, ఈ వ్యాధి వల్లనే వారి కా ఉద్యోగం దొరక్కుండా పోయింది! కొంతమంది నూతన దంపతులకీ గజ్జి వల్లనే మొట్ట మొదటి రాత్రి సౌఖ్యం వట్టి యాతనగా తయారయింది.

ఈ గజ్జి వ్యాధి విపరీతంగా తీట, దురద కలిగిస్తుంది. ఇందువల్ల గోక్కోవడం తప్ప మరే పని చెయ్యలేడు రోగి!

ఈ గజ్జి క్రిమికి ఎనిమిది కాళ్ళు! ఇది చర్మం పైపొరల్లో దొలుస్తూ భరించలేనంత తీట కలిగిస్తుంది. ఈ రోగం చాలా తేలికగా వ్యాపించే అంటు వ్యాధి. చర్మపు పొరల్లో గుల్లలు చేసుకొని ఈ క్రిమి విశ్రాంతిగా నివసిస్తుంది.

గజ్జి క్రిమి పగటి వేళలో కన్న రాత్రి వేళలోనే ఎక్కువ బాధ కలిగిస్తుంది. కనుకనే రాత్రి వేళే తీట విపరీతంగా ఎక్కువవుతుంది.

గజ్జి క్రిమి గొప్ప సామ్యవాది! కనుకనే కుటుంబంలో అందరి లోను ఇది అతి త్వరితంగా వ్యాపిస్తుంది. మొట్టమొదట స్కూళ్ళలోను, ఆట స్థలాలలోను ఇది పిల్లలలో ఎక్కువగా వ్యాపిస్తుంది. తరవాత వారి తల్లిదండ్రులకు, మిగిలిన వారికి అంటుకుంటుంది.

మొదట ఈ వ్యాధి వేళ్ళ సందుల లోను, కడుపు మీద, మణికట్టుల మీద అంకురించి క్రమక్రమంగా శరీరం అంతట అలుముకుంటుంది. పిల్లల ఒంటి కంతటికికూడా ఇదే విధంగా ఈ వ్యాధి అల్లుకు పోతుంది.

సామాన్యంగా రాత్రి వేళ పసిపిల్లలు అదే పనిగా ఏడుస్తున్నప్పుడు, తల్లులు అసలు కారణ మేమిటో కనుక్కోక వారికి పాలిచ్చి ఊరుకో బెట్టాలని ఆరాట పడతారు.

మొట్టమొదట ఈ వ్యాధికి తగిన చికిత్స చెయ్యక అదే పనిగా గోక్కోవడం కొనసాగిస్తే ఈ రోగంలో రెండవ దశ ప్రారంభము స్ట్రెప్టో, స్టెఫిలో కోక్కై అన్న విష క్రిముల వల్ల ఈ రోగ పరిస్థితి మరింతగా దిగజారుతుంది. దానివల్ల క్రమంగా రోగి ఆరోగ్యంకూడా దెబ్బ తింటుంది.

ఈ వేళ ఈ గజ్జి వ్యాధి ఒక గొప్ప సాంఘిక సమస్యగా తయారయింది.

దీనికి వైద్యం చాలా శ్రద్ధగా, జాగ్రత్తగా చెయ్యాలి. ఇది రోగికే కాక కుటుంబ సభ్యుల కందరికి అవసరమే!

చర్మం మీద పుయ్యడానికి సల్ఫర్ ఆయింట్మెంట్ చాలా మంచి మందు. ఇది మూడు రోజుల పాటు వాడాలి. ఈ సమయంలో స్నానం పనికిరాదు. కట్టుకొనే బట్టలు, దుప్పట్లు, దిండు గలీబులు నిత్యమూ శుభ్రముగా వేడి నీళ్ళతో ఉతకాలి. ఏ మాత్రం వైద్యంలో అజాగ్రత్త వహించినా, ఈ వ్యాధి మళ్ళీ మొదటి కొస్తుంది. అప్పుడు వైద్యునికీ, రోగికీ తీరని సమస్యగా తయారవుతుంది. *

శిల్పంలో శిక్షణ

-జి. కృష్ణ

ఈ మధ్య కాలంలో శిల్పాల చౌర్యం వార్తలు చాలా వింటున్నాం దేవాలయాలనించి, చెల్లాచెదురుగా ఉన్న పురావస్తు సంపద నించి ఎన్ని శిల్పాలు చోరీ అయినవో చెప్పలేం! పాతవి పోతున్నవి. కొత్తవి రావడం లేదు!

ఆళ్ళగడ్డలో దేవాలయాలకు కావలసిన విగ్రహాలు, స్తంభాలు, ఇతర శిల్పాలు రూపొందించేవా రున్నారు

దుర్గి (మాచర్లవద్ద) లో శిల్పులున్నారు. వారు తయారు చేసే అలంకార శిల్పాలను అమ్మడానికి కొంతవరకూ పరిశ్రమల శాఖ తోడుపడుతున్నది.

కళాప్రియులు మెచ్చే శిల్పాలు రూపొందించే వారూ అక్కడా అక్కడా ఉన్నారు.

శిల్పకళా ప్రజ్ఞకు నిదర్శనాలుగా నిలిచి ఉన్న దేవాలయాలను కొన్నింటిని, ఇటీవలి కాలంలో మరామత్తు చేస్తున్నారు. ఈ మరామత్తు పురావస్తు రక్షణ తత్వానికి విరుద్ధంగా ఉంటున్నదని కొందరు గోల గినా, కొన్ని ఆలయాలలో శిల్పమే కానరాకుండా సిమెంటు సున్నం దట్టిస్తున్నారు.

దేవాలయ శిల్పాలను కళా దృష్టితో గానీ, పురావస్తు విజ్ఞాన దృష్టితోగానీ పరిరక్షించడం లేదని ఈ మధ్య కేంద్ర పురావస్తు శాఖ, హైదరాబాదు కార్యాలయాధిపతి డాక్టర్ కార్తికేయ శర్మ సోదాహరణంగా వివరించారు.

ఇంతకు ఆంధ్రప్రదేశ్లో శిల్పానికి సంబంధించిన పనులు చేయడానికి ఇతర రాష్ట్రాలనుంచి శిల్పులను తెప్పిస్తున్నారు. ఇక్కడ కూడా యువకులకు తర్ఫీదు ఇస్తే బాగుంటుందని దేవాదాయ శాఖ వారికి సంకల్పం కలిగి, కిందటి సంవత్సరం ఒక శిల్ప కళాశాల ప్రారంభించారు. దేవాదాయ శాఖ కమీషనరు కార్యాలయం ఆవరణ లోనే ఉన్నది ఈ కళాశాల.

నాలుగు సంవత్సరాలలో తగు శిక్షణ ఇవ్వవచ్చునని నిర్ణయించారు శిల్ప సలహా దారులు, దేవాదాయ శాఖవారు కలిపి. నాలుగేళ్ళ శిక్షణ అనంతరం ఈ యువ శిల్పులు- రాష్ట్రంలోని ముప్పది వేల దేవాలయాలకూ అవసరమైన శిల్పాలను తయారు చేయగలుగుతారని ఆశ.

ప్రతి విద్యార్థికీ నెలకు 75 రూపాయలు ఉపకార వేతనం ఏర్పాటుచేశారు. కిందటి సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు రాలేదు. కష్టం మీద పన్నెండు మందినే సమకూర్చుకో గలిగారు. వారు ఇప్పుడు రెండవ ఏడాది శిక్షణ లోకి చేరుకున్నారు. ఈ సంవత్సరం 20 మంది చేరారు.

శిల్పకళానిధి శ్రీ ఎస్. ఎమ్. గణపతి స్థపతి ఈ కళాశాలకు ప్రధానాచార్యుడు. ఎక్కువకాలం కళాశాలలో ఉండి బోధన చేస్తూ, బోధనను పర్యవేక్షిస్తూ ఉండేది వైస్ ప్రిన్సిపల్ శ్రీ వాగీశ్వరరావు.

దేవాలయ శిల్పం, రాళ్ళు చెక్కడం, చిత్రాలు గీయడం, లోహవిగ్రహాలకై అచ్చులు పోయడం, రథ నిర్మాణం, వర్ణాలంకరణ, ఖర్చుల అంచనా .. ఇవి పాఠ్యాంశాలు. ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతం, గ్రంథాక్షరి నేర్పుతారు. పురాతన శిల్ప గ్రంథాలు గ్రంథలిపిలో ఉన్నాయి — సంస్కృతంలో ఉన్నాయి. ఏడవ తరగతి చదివిన వారినే ఈ కళాశాలలో చేర్చుకుంటారు.

ఇక్కడ పరీక్షల్లో నెగ్గితే, 'శిల్ప విద్యా ప్రవీణ' పట్టం ఇస్తారు.

ఇటీవల అమెరికాలో కట్ట తలపెట్టిన దేవాలయాలను (విడివిడి భాగాలుగా తీర్చిదిద్దారు. అక్కడ తగు రూపంలో అమరుస్తారు), విగ్రహాలను పంపేటప్పుడు, అమెరికా వెళ్ళే శిల్పులకు వీడ్కోలు ఇచ్చారు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు *

అండమాన్ ఖైదీ

కథానిక -కె. ఎన్. రావు

అండమాను దీవుల్లో ఒక చిన్న గ్రామం. ఆ గ్రామానికి ఒక పక్క సరిహద్దు సముద్రం. సముద్రం లోకి నూరడుగుల మేరకు కలపతో కట్టిన జెట్టీ ఊరికి సింహ ద్వారంలా ఉంది. దగ్గిరలో ఉండే దీవుల మధ్య రాకపోకల సౌకర్యం నిమిత్తమై తిరుగుతూ ఉండే మధ్య రకం పడవలు ఇక్కడ లంగరు లేస్తాయి. గ్రామాన్ని రెండు భాగాలుగా విడదీసుకుంటూ పోయిన రోడ్డుకి ఇరు వైపులా ఎనభై ఇళ్ళ కంటె ఎక్కువ లేవు. వాటిలోనే టీ హోటల్, కిరాణాకొట్టు, బీడీ సిగరెట్ల దుకాణం, పోలీసుఠాణా వగైరా లున్నాయి. సముద్రపు దిక్కు మినహాయించి అన్ని దిశలలోను కాలపరిమితి తెలియని ఎత్తయిన వృక్షాల చేత చాలా వరకు ఆకాశమంతా కప్పబడి పోయింది. అక్కడికి ఓ కిలో మీటరు దూరంలో ఓ చిన్న కొండ మీద పురాతన మైన బంగళా ఒకటి కొట్టొచ్చినట్లు కనిపిస్తూంటుంది ఆ బంగళాలో పూర్వం ఉద్యోగరీత్యా వెళ్ళిన తెల్ల దొరలు నివసించే వారు. వారి అనంతరం ఇప్పుడు మన దొర లుంటున్నా రనుకోండి! అసలు దాన్ని చూడగానే రాబర్ట్ క్లైవు, వారన్ హేస్టింగ్స్ మొదలయిన పెద్దలు జ్ఞాపకం రాక మానరు.

ప్రస్తుతం దాంట్లో ఉంటూన్న మన దొర నాకు బాగా తెలిసిన వాడే. తెలిసిన వాళ్ళందరిని తేలిగ్గా స్నేహితుల కింద జమ కట్టడం తన గొప్పయి తానే తప్పుకోవడ మన్నాడు, వెనకటికి ఒకాయన. కాని, ఈ వ్యక్తిని మాత్రం స్నేహితు డనే చెప్పుకోవాలి. ఓ రోజున ఉన్నట్టుండి ఊడి పడి—"మా ఊరొస్తావా రావా?" అని మారాం చేశాడు. మరి తప్పింది కాదు మేము మోటారు బోట్లోంచి జెట్టీ మీదికి దిగినప్పుడు ఒక పక్క సూర్యాస్తమయం, మరో పక్క చంద్రోదయం పోటీల మీద జరుగుతున్నాయి. అక్కణ్ణించి ఆయన బంగళా కున్న దూరం చాలా తక్కువనిపించి జోరుగా నడిచి ఒగర్చుకుంటూ వెళ్ళి ఇంట్లో పడ్డాం. భోజనా లయాయి. తదనంతరం తాంబూలం సేవించాం. ఆ రోజు పౌర్ణమేమో వెన్నెల పిండి ఆరబోసినట్లుంది. ఆ పాల వెన్నెల్లో సముద్రం లోకి చొచ్చుకు పోయిన జెట్టీ పైన ఓ పావు గంట నడుం వాల్చి, కెరటాలతో పలుకుతూ, కులుకుతూ ఆ అడవుల్లోంచి పిల్ల గాలులు తెచ్చే పరిమళాన్ని పీలుస్తూ,తద్వారా పొందే మైకానికి దాసుణ్ణయి పోవాలనే వాంఛ నా మనస్సులో చెలరేగింది. "ఏం గురూ?" అన్నాను. "సరే,పద" మన్నాడు, జెట్ విమానాల్లా వచ్చి జెట్టీ మీద పడ్డాం. అప్పుడే ఠాణాలో గంటలు కొట్టారు. మిత్రుడు లెక్క పెట్టి "పది" అన్నాడు. "ఓహో, అలాగా!" అన్నాను, ఎదురుగా సముద్రం లోంచి తారాజువ్వలా పైకి లేచి వచ్చి పది అడుగులు పైకెగిరిన డాల్ఫిన్ని చూస్తూ. ఎగిరిన డాల్ఫిన్ వెన్నెల కాంతిలో ధగధగా మెరుస్తూ కిందికి పడుతూంటే నా తలకు 'చూడు, నా ఒంపుల్లో సొంపు చూడు' అని ఒయ్యారం ఒలకబోస్తున్నట్లనిపించింది టక్కుమని మెర్లిన్ మన్రో జ్ఞాపకం వచ్చింది. పాపం, చచ్చి ఎక్కడుందో! ఏదో బాధ అనిపించింది.

దూరంగా ఏదో నీడ కదిలింది.

"ఎవరది?" అన్నాడు నా మిత్రుడు, స్వరం తప్పిన గొంతుతో.

సమాధానం లేదు. ఇద్దరం ఆ కదులుతున్న నీటి వైపే దృష్టి సారించాం. నీడ దగ్గిరయింది.

"సైహూం, హమీద్ అలీ! సలామాలేకూం" అంటూ కొంచెం ఎడంగా చతికిల పడ్డాడు ఆ వచ్చిన మనిషి

"ఈ ఊరికి కొత్త వాడి వనుకుంటాను" అంటూ ప్రారంభించాడు మా వాడు. నిజానికి మా వాడి ఉద్దేశ్యం, ఆ వచ్చి కూర్చున్నది ఒక దయ్యమని. ఎలుగుబంటికి నిప్పు చూపించితే ఎంత భయమో, మా వాడికి దయ్యం పేరు చెపితేనే అంత భయం!

"నేను పాతవాణ్ణే. మీ రిక్కడికి వచ్చి రెండు నెలలయినా కాలేదు. నన్ను మీరు చూసి ఉండక పోవచ్చు. మీ రెవరో నాకు బాగా తెలుసు" అన్నాడు హమీద్ అలీ. అవుననుకుని మా వాడు సరిపెట్టుకున్నాడు.

"అండమానుతో నీ కే విధమైన సంబంధం?" అని నా మిత్రుడు అడగ్గా,భూమి దద్దరిల్లేట్లు నవ్వాడు. ఇద్దరం ఉలిక్కి పడి కావలించు కోవడానికి వాటం కుదరక ఒకరి చేతులు ఒకరు పట్టుకుని తృప్తి పడ్డాం. అతడు తన పూర్వ వృత్తాంతం చెబుతూంటే చెవులు నిక్క బొడుచుకుని విన్నాం.

హమీద్ అలీ డెబ్బై ఏళ్ళ వృద్ధుడు. ఆజానుబాహువు. వెన్నెల కాంతికి మెరుస్తూన్న అతని పండిపోయిన గడ్డం లోంచి ఠీవి ఉట్టి పడింది. ఆ వ్యక్తిని చూస్తూంటే వెనకటి పాదుషాలు మెదడులో మెదిలారు. ప్రస్తుతం బాంగ్లాదేశ్లో ఉన్న మైమన్సింగ్లో పుట్టి పెరిగాడు. రెండున్నర దశాబ్దాలు నిండీ నిండకుండానే అన్ని సంబంధాలు తెంచుకుని వందల మైళ్ళు సముద్రం దాటి అండమాను చేరాడు తల్లి తండ్రుల ప్రేమకు, బంధుమిత్రుల వాత్సల్యానికి శాశ్వతంగా దూరమయ్యాడు. ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించిన షమీమ్బానుకు హృదయంలో చల్లారని అగ్ని రగిల్చాడు నుదుట వ్రాసిన వ్రాతకు తల ఒగ్గాడు.

అన్న అబ్బాస్ అలీ దేవుడి లాంటి మనిషి. కాస్తో, కూస్తో ఆ వీధిలో ఉన్న వాళ్ళంతా కష్ట సమయాల్లో అబ్బాస్ అలీ సహాయం పొందిన వాళ్ళే. ఎదటి వాడు బాధ పడుతూంటే చూసి చక్కా పోయే వాడు కాడు. అందరి సుఖ దుఃఖాల్లోను భాగం పంచుకునే వాడు. అంతా అతన్ని గౌరవించి పూజించారు. అన్నగారిని దేవుడుగా కొలిచి ఆయన అడుగు జాడల్లో నడిచేవాడు హమీద్ అలీ.

రజాక్ ఓ పైలా పచ్చీసు మనిషి. ఊళ్ళో ఏ గొడవలు, గందర గోళాలు జరిగినా అవసరం లేని జోక్యం కలగ జేసుకునే వాడు రజాక్ తల్లి వృద్ధురాలు. కంటి చూపు ఏనాడో పోయింది. రజాక్ ఇంటి విషయాలేవీ పట్టించుకునే వాడు కాడు. పట్టించుకోవడానికి తీరుబడికూడా అయ్యేది కాదు. ఎప్పుడైనా ఇంటికి వస్తే చుట్టం చూపుగా వచ్చే వాడు. ఆ పరిస్థితుల్లో ఆ ఇంటి బాధ్యత అన్నీ రజాక్ చెల్లెలు షమీమ్ బాను వహించవలసిన అవసరం ఏర్పడింది. "అంద చందాల్లో షమీమ్బాను ముందు జగదేకసుందరి సలీమ్ భార్య నూర్జహాన్కూడా బలాదూర్" అన్నాడు హమీద్ అలీ షమీమ్ అవివాహిత తీరిక లేని రజాక్ అంధురాలైన తల్లిని గురించి కాని, అవివాహిత అయిన చెల్లెల్ని గురించి కాని ఎప్పుడూ ఆలోచించిన పాపాన్ని పోలేదు. ఈవిషయంలో రజాక్ వైఖరి సుతరామూ నచ్చక వారి శ్రేయస్సు కోరిన అబ్బాస్ అలీ ఎప్పటి కప్పుడు బాధ పడుతూవచ్చాడు హమీద్ అలీ, షమీమ్ కొంత కాలంగా గాఢమైన ప్రేమలో పడ్డారన్న సంగతి రజాక్కి ఎప్పటికో కాని తెలిసింది కాదు. మామూలు పరసలో కారాలు మిరియాలు నూరకుండా అంతా తన మంచికే నని రజాక్ సరిపెట్టుకుని సంతోషించాడు. చెల్లెలు పెళ్ళి అయిందనిపిస్తే తన బాధ్యత తీరి తనకు మరింత స్వేచ్ఛ లభిస్తుందని ఉబలాట పడ్డాడు అబ్బాస్ అలీతో తన మనస్సు విప్పి చెప్పాడు.

అంతా విన్న అబ్బాస్ అలీ ఒక షరతు పెట్టాడు దారం తెగిన గాలి పటానికేమీ తీసి పోనటువంటి రజాక్ పెళ్ళి చేసుకుని ఒక ఇంటి వాడయితే ప్రయోజకు డవుతాడన్న నమ్మకం, ఆశ కలిగి చెల్లెలు కంటె ముందు పెళ్ళి చేసుకోమని వయస్సు ముదిరిన రజాక్ని ప్రోత్సాహ పరిచి, తన తమ్ముడికి షమీమ్ని చేసుకుంటానని, ఆ పెళ్ళి జరిపించే బాధ్యత తానే వహిస్తానని అబ్బాస్ హామీ ఇచ్చాడు. పెట్టిన షరతు కఠినంగా తోచినప్పటికీ, చెల్లెలు శ్రేయస్సు ప్రధానంగా భావించి రజాక్ అబ్బాస్ అలీ మాట తోసివెయ్యలేకపోయాడు.

అది అక్కడ జలియన్వాలాబాగ్లో కాల్పులు జరుగుతున్న సమయం తెల్లవాడి తుపాకి గుండ్లకు వందలాదిగా భారత పౌరులు నేలకి ఒరుగుతున్న సమయం. ఇక్కడ పెళ్ళి కొడుకు రజాక్ బాగా ముస్తాబై పంచ కళ్యాణి అశ్వాన్ని ఎక్కి అట్టహాసంతో పెళ్ళి వారింటికి తరలి వెళ్ళాడు.

జలియన్వాలాబాగ్ వార్త అప్పుడే దేశం నలు మూలలా వ్యాపించి ప్రతి భారతీయుడి హృదయంలోను ఒక కుంపటి వెలిగింది. దేశమంతటా బహిరంగ సభలు జరిగాయి. తెల్లవాడి అమానుషకృత్యాన్ని తునా తునకలుగా ఖండించి విమర్శించారు దుమ్మెత్తి పోశారు వెంటనే బహిరంగ సభలు నిషేధించ బడ్డాయి. తెల్ల ప్రభుత్వంపై ఎర్ర కన్ను చూపిన వారి నందరిని జైళ్ళలో వేశారు. ప్రాంతీయ విప్లవ కారులుగా అనుమానితులైన పౌరుల్లో రజాక్ ఒకడు రజాక్ని అరెస్టు చెయ్యడానికి ఇన్స్పెక్టరు రజ్వీ తన సిబ్బందితో వెళ్ళి పెళ్ళి వారింటిని చుట్టు ముట్టాడు సాయుధులైన పోలీసుల రాకకు కారణం తెలియని అబ్బాస్ అలీ నిశ్చేష్టుడయి నిలబడి పోయాడు రజ్వీ ముందుకి వచ్చి విషయాన్ని విడమరిచి చెప్పి మర్యాదగా రజాక్ని తన స్వాధీనం చెయ్యమని ఆజ్ఞాపించాడు.

అంతకు ముందే పెళ్ళి విందు పూర్తి అయింది. వధూవరుల్ని ఆశీర్వదించి అంతా వెళ్ళిపోయారు. శోభనం గది అన్ని అలంకారాలు అందుకుని సిద్ధంగా ఉంది. ఇంకా ఆలస్య మెందుకన్నట్లుగా వధూవరుల్ని గదిలోకి పంపారు. రజ్వీ వచ్చిన సమయానికి బహుశః ఆ వ్యవధిలో వారిద్దరి మధ్య తియ్యటి తొలి పలుకులైనా జరిగాయో, లేదో చెప్పడం కష్టం పెళ్ళి కూతురు సిగ్గు విడవడానికి ప్రయత్నిస్తూ ఓర కంటితో తన నాథుణ్ణి మనసారా చూసిందో, లేదో చెప్పడం కష్టం. అంతలోనే అంతరాయమా!

మురిపెంగా ఉండే మొదటి రాత్రి ముచ్చట అప్పుడే తీరిపోతుందా? అయ్యో. ఏమి టీ శాపం? తుపాను గాలికి కూకటి వేళ్ళతో పెల్లగించుకుని నేల మీద వాలిన మహా వృక్షంలా అబ్బాస్ అలీ నిలుచున్న పళంగా నేల మీదికి ఒరిగాడు. తలవని తలంపుగా ఎదురైన సమస్య క్షణాల మీద నివారణ కాకపోతే జరగబోయేది దుర్భర సంఘటన. ఏ విధంగా దీన్నెదుర్కోవాలన్నదే మరో సమస్య అయి కూర్చుంది అబ్బాస్ అలీకి. బుద్ధి ఏ మాత్రం పని చెయ్యలేదు చివరికి దీనంగా చేతులు జోడించాడు ఆ రాత్రి—గడిచిపోగా మిగిలిన రాత్రి, సూర్యోదయానికి మిగిలి ఉన్న ఎనిమిది గంటల రాత్రి. ఆ శేష రాత్రి గడు వియ్య మని ప్రాధేయపడ్డాడు. ఉదయం వెలుగు రాగానే తానే స్వయంగా రజాక్ని స్వాధీనం చేస్తానని అల్లా మీద ప్రమాణం చేసి చెప్పాడు రజ్వీ రవంతకూడ చలించ లేదు. పాదాలమీద పడి కన్నీటితో అభిషేకం చేశాడు. ఆ తైమూరు తమ్ముడు, బద్మాష్ బూటు కాలుతో బలంగా తలపై తన్ని ఎదురుగా కనిపిస్తూన్న తలుపులు మూసిన గది వైపు అడుగులు నడిపించాడు. రజ్వీ ముందుకు పోకుండా అతని అడుగులకు అబ్బాస్ అలీ అడ్డు పడ్డాడు. ఈ మారు తీవ్రంగా, నిర్దాక్షిణ్యంగా, తన బూటు కాలును పదేపదే ప్రయోగించాడు. ఇనుప నాడాల తీవ్రమైన తాకిడికి తల చిట్లి రక్తం ధారలుగా కారింది. జరుగుతున్న అన్యాయాన్ని చూసి సహించలేక హమీద్ అలీ సింహంలా గర్జిస్తూ చెంగున వచ్చి రజ్వీ మీద పడ్డాడు. హాజరుగా పక్క నున్న పోలీసు వాళ్ళు చప్పున పట్టేశారు రజ్వీకి ప్రమాదం తప్పింది. అబ్బాస్కి స్పృహ తప్పింది. అంతే. మళ్ళీ కళ్ళు తెరవ లేదు. తాను గడు వడిగిన శేషరాత్రికూడా ముగియక ముందే తన జీవిత యాత్ర ముగించాడు.

హమీద్ అలీ గోలు గోలుమంటూ ఏడ్చాడు. ప్రతి నిమిషం ఏడ్చాడు. ప్రతి గంటా ఏడ్చాడు. ప్రతి రోజూ ఏడ్చాడు. నిద్రాహారాలు మాని సమయం కోసం ఎదురు చూశాడు రోజులు, నెలలు కొన్ని దొర్లిపోయాయి. ఎదురు చూచిన సమయం ఒక రోజున రానే వచ్చింది. ఎదురుగా వస్తున్న రజ్వీపై అమాంతం దూకి బాకుతో ఒక పోటు పొడిచి కిందకి పడగొట్టాడు. పిసరంత ప్రాణం ఎక్కడైనా మిగిలి పోతుందేమోనని పోటు మీద పోటు పధ్నాలుగు పోట్లు పొడిచాడు. అప్పటికి కాని హమీద్ గుండెల్లో రగిలిన అగ్ని పూర్తిగా చల్లార లేదు.

ప్రభుత్వోద్యోగిని చంపిన కారణంగా హమీద్ అలీకి ద్వీపాంతర వాస శిక్ష విధించారు. ఇదీ హమీద్ చేసిన నేరం.

"దేవుడి లాంటి నా అన్నను అన్యాయంగా, నిర్దాక్షిణ్యంగా చంపిన ఆ తెల్ల వాడి బానిస, ఆ కుత్తా రజ్వీని నేను చంపితే అది నేరమవుతుందా? మీరు చెప్పండి" అంటూ హమీద్ సూటిగా ప్రశ్న వేశాడు.

హఠాత్తుగా వేసిన ఆ ప్రశ్నకు కొన్ని క్షణాలు తబ్బిబ్బై, తటతటాయించి చివరకు ఏదో సమాధానం చెప్పుదా మనుకున్న మా ఇద్దరికీ మరెందు వల్లనో నోళ్ళు పెగల్లేదు.

హమీద్ అండమానులో శిక్ష అనుభవిస్తూ సంవత్సరాలు యుగాలుగా గడిపాడు. శిక్ష పూర్తిగా అనుభవించి విడుదలయిన వారి నందరిని అండమాను నించి తిరిగి తీసుకు వెళ్ళడానికి వచ్చిన ఓడ జెట్టీ పక్కన సిద్ధంగా ఉంది స్వతంత్రులైన ఖైదీలు ఒక్కొక్కరు నిచ్చెన మీదుగా ఓడపైకి చేరుకున్నారు. బంధాలు విడిపోగానే మరుగున పడ్డ అనుబంధాలు మరోసారి వాళ్ళ మనస్సుల్లో చోటు చేసుకున్నాయి. ఆనందంతో ఎగిరి గంతులు వేశారు పాటలు పాడారు.

హమీద్ అలీ గంతులు వెయ్యలేదు పాటలూ పాడలేదు డెక్ మీద దూరంగా నిలబడి ఆ నల్ల నీళ్ళ సముద్రంలోకి చూస్తూ దీర్ఘమైన ఆలోచన లోకి జారిపోయాడు. ఆందోళన పూరితమైన ఊహలతో తాను నిర్మించుకున్న తెర మీద ఏవేవో దృశ్యాలు ప్రత్యక్షంగా కదులుతున్నట్లు కలవర పడ్డాడు. ఓడ కలకత్తా చేరింది. విముక్తులైన ఖైదీలంతా బహు హుషారుగా కిందికి దిగారు. పూల మాలలు అందులో కొందరిని అలంకరించాయి. కొందరు మెడల మీద ఎక్కి స్వారీ అయి మరీ వెళ్ళారు. కొంతమంది మేళ తాళాలతో స్వాగతం అందుకున్నారు. చివరికి అంతా వెళ్ళిపోయారు. తను ఒక్కడే మిగిలిపోయాడు. తన కోసం ఎవ్వరూ రాలేదు. స్వాగతమూ లేదు, మేళ తాళాలూ లేవు. తనకు 'నా' అన్న వారంతా గతించి పోయారు. స్వగ్రామం చేరుకున్నాడు. గుర్తు పట్ట లేనంతగా మారిపోయింది గ్రామం. "అడుగో అండమాన్ ఖైదీ" అన్నారు, ఎవరో గుర్తుపట్టేసి వారు. ఇంకేముంది! ప్రతి నోరూ—'అండమాన్ ఖైదీ!...అండమాన్ ఖైదీ!... అండమాన్ ఖైదీ!'అన్న మాట పలికింది. భయ భ్రాంతులతో పిల్లా పెద్దా చెల్లా చెదురుగా పరిగెత్తారు. 'నువ్వు ఖూనీకోరువి! నీ కిక్కడ స్థానం లేదు పో!' అన్నట్లుగా కిటికీలు, తలుపులు దభాలున మూసుకున్నారు.

కొద్ది క్షణాల్లో కలకత్తా జెట్టీని విడువబోతున్న ఓడ "బోంయ్" మంటూ కూత పెట్టింది. అంతలోనే అతి త్వరితంగా కలకత్తా చేరిన హమీద్ అలీ ఆలోచన కంతరాయం కలిగింది. తెర మీద బొమ్మలు చెరిగి పోయాయి.

"నేను ఖూనీకోర్ని. . . నేను అండమాన్ ఖైదీని. . ." పిచ్చిగా అరిచాడు.

ఇంతలో 'నిచ్చెన లాగెయ్యి' అంటూ ఎవరో అధికారి ఓడపై నుండి ఉత్తరువు చేశాడు హమీద్ అలీ క్షణంలో ఏదో నిర్ధారణకి వచ్చాడు హుటా హుటిని వెళ్ళి ఓడ మీదికి ఎక్కాడు. నిచ్చెన ఎడిపోయింది ఓడ కదిలింది చూస్తూ చూస్తూండగానే హమీద్కి స్వదేశం దూరమవుతూ, దూరమవుతూ చివరకు అదృశ్య మయింది. కళ్ళమ్మట నీరు కారుతూండగా కనపడని మహా సముద్రపు అవలి ఒడ్డు కోసరం అతని కళ్ళు పిచ్చిగా చూశాయి.

తన శేష జీవితాన్ని అండమాను దీవుల కంకితం చేసి హమీద్ అలీ మాతృభూమికి తిలోదకాలు వదిలాడు. *